హాయిగా కాపురముంటున్న ఆ దంపతులను వేరుచేసిన ఆ రాత్రి?

# మైఉషారాణి కథ

శిక్ష

రాత్రి జరిగిన సంఘటనతో తెల్లవార్లు నిద్రలేకుండా పోయినా, రోజువారీ కార్యక్రమాలకి భంగం రాకూడదుకదా అనుకుంటూ విసుగ్గా లేచింది సుధ.

లేవటమయితే విసుగ్గా లేచింది కానీ సోఫాలో కాళ్ళు రెండూ బార్లా జాపి అస్తవ్యస్తంగా పడుకున్న సుధీర్‌ని చూడగానే ఒక్కసారిగా జాలేసింది సుధకి.

నాకన్నా రెండు రెట్లు బాధపడిపడీ ఇప్పుడే నిద్రపట్టినట్లుంది. అనవసరంగా లేపటమెందుకు అనుకుంటూ అతనికి నిద్రాభంగం కాకుండా నిశ్శబ్దంగా తన పని తాను చేసుకుపోసాగింది.

దాదాపు 7 గం. కావొస్తుండగా సుధీర్ లేచిన అలికిడి అయ్యింది. లేవగానే బెడ్‌కాఫీ తాగే అలవాటు సుధీర్‌ది. ఒక్కక్షణం ఆలస్యమయినా ఆగలేడు. అందుకే గబగబా కాఫీ కలుపుకొచ్చింది.

సుధీర్ పేపర్ చదువుకుంటూ ఉంటే ఇదిగోండి కాఫీ. టీపాయ్‌మీద పెడుతున్నాను. చల్లారిపోకుండా తాగండి అంటూ లోపలికి వెళ్ళింది.

కాస్సేపాగి ఏదో పనిమీద ముందుగదిలోకి వచ్చిన సుధకి టీపాయ్‌మీద పెట్టిన కాఫీ అలాగే ఉండిపోవడం సుధీర్ అక్కడ లేకపోవడం గమనించింది. కాఫీ తాగకుండా ఈయన చేసే రాచకార్యాలు ఇంత పొద్దున్నే ఏమున్నాయబ్బా అనుకుంటూండగా ఇంతలో స్కూటర్ శబ్దం అయ్యింది.

స్కూటర్‌కి స్టాండ్ వేసి లోనికి వస్తూ కనిపించాడు సుధీర్.



అదన్నమాట సంగతి. బైట హోటల్ కి వెళ్ళి తాగొస్తున్నారన్నమాట.

కోపం ఒక్కసారిగా ముంచుకొచ్చింది సుధకి. తాను కలిపిన కాఫీ తాగనప్పుడు వడిన వంట మాత్రం తింటారని నమ్మకం ఏమిటి? వండటం మానేద్దామా అని అనుకుంది.

కానీ అది క్షణం సేపుమాత్రమే.

మరుక్షణమే సుధీర్‌కి బయట తినటం ఏ మాత్రం ఇష్టం ఉండదని గుర్తొచ్చి పైగా ఆఫీసుకి వెళ్ళే టైమ్ అవస్తోందని గబగబా లోనికి నడిచి వంట కార్యక్రమంలో మునిగిపోయింది.

ఈ లోపల సుధీర్ స్నానం చెయ్యడం బట్టలు వేసుకోవడం అంతా ఓ కంట కనిపెడుతూనే ఉంది. అన్నీ సిద్ధం చేసి భోజనానికి రండి. అంతా తయారైంది అని చెప్పాలనిపించికూడా ఆయనే అంత బిగుసుకుపోయి ఉంటే తను మాత్రమేనా ఎలాంటి పట్టువిడుపులూ లేంది. ఆయనే వచ్చి అన్నం పెట్టమంటేనే పెడతాను. అనుకుంది మనసులో.

కానీ 9.30 అయినా సుధీర్ వంట ఇంట్లోకి రాకపోవడంతో సుధకి అనుమానం వేసింది. ఇందాకట కాఫీలానే భోజనం కూడా బయటే చేసేస్తాడేమోనని.

స్కూటర్ స్టార్ట్ అయిన శబ్దంతో ఆలోచనల్నించి ఈ లోకం లోకి వచ్చిపడింది సుధ. ఈయనే కాబోలు వెళ్ళిపోతున్నారు అనుకుంటూ గబగబా బయటికి నడిచింది వెళ్ళే సుధీర్‌ని ఆపుదామా అనుకుంటూ.

కానీ అప్పటికే స్కూటర్‌మీద వెళుతూ అంతదూరంలో కనిపించాడు.

అయ్యో లేనిపోని అభిమానానికి పోయాను. నేను పిలిస్తే వచ్చి భోజనం చేసేవారేమో. అనవసరంగా తెగేదాకా తాడు లాగినట్లు నేనూ అలా ప్రవర్తించానేమో అనుకుంది బాధగా.

కానీ వెనువెంటనే తాను చేసింది మాత్రం ఏం తప్పు. అసలు జరిగినదాంట్లో తన వంతు ఎంత? అనే ఆలోచన కల్గింది.

సుధీర్ ప్రవర్తనని గమనించిన సుధకి ఒకటి మాత్రం అర్థం అయింది. తను ప్రొద్దున్న ఆయన జరిగిన విషయానికై బాధపడిపోతున్నారని మాత్రమే అనుకుంది. కానీ అది నిజం కాదు. జరిగిన దానికి తననే బాధ్యురాల్ని చేసి ఆయన ఒక సాధారణ మొగవాడిలాగ ఆలోచిస్తున్నాడని ఇప్పుడే తెలిసింది.

ఇదేకనుక కొనసాగితే ఆనందంగా సాగిపోతున్న తమ సంసారం విషాదంగా మారటానికి ఎంతోకాలం పట్టదు.

దీన్ని పోగొట్టాలంటే తను నిగ్రహం కోల్పోకుండా కాస్త సహనంగా పరిస్థితుల్ని ఎదుర్కోవేందుకు సిద్ధపడాలి.

ఆయన ముభావాన్ని చూస్తూ ఉండి మనసులో ఉన్న మాటలు చెప్పగలనా లేదా అనే సందేహం వేస్తోంది.

వీటన్నిటికన్నా ఉత్తమం మనసులోని భావాలని అక్షరరూపంలో పెట్టి ఆయనకి అందిస్తే సరి అనుకుంటూ తన భావాల్ని బాధల్ని కాగితంపై పెట్టసాగింది.

ప్రియమైన సుధీర్‌కి —

అని రాయబోయి అవునా సుధీర్ నాకు ప్రియమైనవాడే. ఇష్టుడే. కానీ, ఈ ఉన్న పరిస్థితుల్లో ఆయనకి నా పిలుపు సంబోధన, కారం రాసినట్లు ఉంటుందేమో. మొదట ఆయన మూడ్స్‌ని బాధపెట్టడం ఎందుకు అనుకుంటూ ఎలాంటి సంబోధనల్ని పెట్టకుండా సాదాసీదాగా ఉత్తరం రాయటం ప్రారంభించింది.

మీరు ఎందుకు ఇలా మారిపోయారు.

ఎందుకని ముభావంగా ఉంటున్నారు అని నేను అడగదలుచుకోలేదు. ఎందుకంటే నేను అర్థం చేసుకోగలిగాను కాబట్టి.

కానీ నాకు అర్థం కానిది ఒకటే. నిజానికి జరిగినదాంట్లో నా బాధ్యత ఎంత వరకూ అనేది. నేను వద్దు మొర్రో అంటూ ఉన్నా ప్రకృతి, రసాస్వాదన అంటూ రాత్రి ఎటూగానివేళ ఊరు చివరకి తీసుకుని వెళ్ళటం, తిరిగి వస్తూ ఉన్న సమయంలో స్కూటర్ పాడవటం, దాన్ని బాగుచెయ్యడానికని ఆగిన సమయంలో నా అదృష్టం బాగోలేక తాగి విచక్షణాజ్ఞానాన్నే కోల్పోయిన వాళ్ళ దృష్టిలో నేను పడటం ఇదంతా నేను కావాలని చేసిన పనా? లేక నేను వాంఛించిన సంఘటనా?

సహనంతో, నిష్పక్షపాతంగా ఆలోచిస్తే అక్కడ పరిస్థితికి మన ఇద్దరి బాధ్యత ఎంతో మీరు గుర్తించగలుగుతారు.


మొగవారై ఉండీ వాళ్ళు చూపించిన కత్తిని చూసి భయపడిపోయారే. మరి నేను వాళ్ళని ఎదిరించలేదని నా మీద మీకు ఎందుకుంత కోపం.

నేను మిమ్మల్ని ఆక్షేపించాలని కాదు. కానీ భర్త అయివుండీ, మొగవారై ఉండి పరిస్థితిని ఎదుర్కోలేనప్పుడు నేను మాత్రం చేసేదేముంది అక్కడ.

నిజానికి మీ అసక్తతను ఆధారంగా తీసుకుని చిన్నచూపు చూడాల్సింది నేను. కానీ ఇక్కడ అందుకు వ్యతిరేకంగా జరుగుతోంది.

జరిగినదాంట్లో మన ఇద్దరి బాధ్యత ఏమీ లేదని నేను గ్రహించగలిగాను కాబట్టే నేను మామూలుగా ప్రవర్తించగలుగుతున్నాను. జరిగిన సంఘటనని ఒక స్త్రీగా ఎప్పటికీ మర్చిపోలేను. ఆ బాధ అవమానం మీ కన్నా ఎక్కువగా నన్నే బాధిస్తోంది.

కానీ గృహిణిగా నా కర్తవ్యం మీ భార్యగా నా బాధ్యత గుర్తుండబట్టి, నేను అవమానాన్ని గుండెల్లో దాచుకుని పైకి మామూలుగా ఉండగలుగుతున్నాను. నా



పరిస్థితిని అర్థం చేసకుని ఈ సమయంలో నాకు కావాల్సిన అనురాగాన్ని ఆప్యాయతనీ నాకు లేకుండా చెయ్యకండి.

ఓ భర్తగా, భార్య బాధల్లో పాలు పంచుకోండి. మీ నుంచి పూర్తి సహకారం ఉంటే కానీ జరిగినది ఓ పీడకల అని మర్చిపోతాను. మన జీవితం సవ్యంగా సాగాలంటే మీ సహకారం పూర్తిగా కావాలి.

మీ నుంచి అనురాగాన్ని ఆశిస్తూ....

కాలింగ్ బెల్ అదేపనిగా మ్రోగుతూ ఉండటంతో ఉలిక్కిపడి ఒక్కసారిగా లేచింది.

అప్పుడే 5.30 అయ్యిందా అనుకుంటూ గడియారం వైపుచూసి ఉలిక్కిపడింది. గడియారం 7.00 అయినట్లు చూపిస్తోంది. అబ్బ మొద్దునిద్ర పట్టేసింది అనుకుంటూ గబగబా తలుపు తీయడానికి వెళ్ళింది.

సుధీర్ ఏమయినా కొంచెమయినా మారాడా లేక ఇంకా అలానే ఉన్నాడా అనుకుంటూ అతని ముఖంలోకి చూసింది సుధ.

అసలు ఇవేవీ తనకి పట్టనట్లుగా అసలు అక్కడ ఇంకో మనిషి ఉన్నట్లుగా కూడా గమనించనట్లు లోపలికి వెళ్ళిపోయాడు సుధీర్.

అలా ముభావంగా భారంగా నాలుగు రోజులు గడిచిపోయాయి. పైకి ముభావంగా కనిపిచినా ఏదో తర్జనభర్జనకి గురవుతున్నట్లు ఏదో నిర్ణయానికి రాలేక తీవ్రంగా బాధపడుతోన్నట్లు సుధీర్‌ని గమనిస్తున్న సుధకి అనిపించింది.

కానీ అతడు ఎలాంటి నిర్ణయానికి వచ్చాడో మాత్రం గ్రహించలేకపోయింది.

అదే ఆలోచిస్తూ కూర్చున్న సుధకి పోస్ట్ అన్న పిలుపు వినిపించింది. తలుపుతీసిన సుధ ఆశ్చర్యపోయింది. అది రిజిస్టర్డ్ లెటర్ కావడంతో తనకేం రిజిస్టర్డ్ లెటర్ వస్తుందా అని అనుకుంటూ—

సంతకం చేసి లోపల ఏముందో చూద్దాం అనుకుంటూ చించిన సుధ అక్కడ కనిపించిన వాటిని చూసి అవాక్కయిపోయింది.

అవి సుధీర్ నుంచి విడాకులు కోరుతూ వచ్చిన కాగితాలు. పైగా అందులో చిన్న ఉత్తరం కూడా కనిపించింది.

ఎలాంటి సంబోధనా లేకుండా, ఆ ఉత్తరం ఇలా సాగింది. ఈ జరిగిన దాంట్లో నీ నా తప్పు ఎంత ఉంది అని నేను ఆలోచించడం లేదు. కానీ నేను నీతో కాపురం చెయ్యలేను. నిన్ను చూస్తూ జరిగిన విషయాన్ని మర్చిపోయేటంత విశాల హృదయం నాకు లేదు.

నేను లాయర్‌ని కన్సల్ట్ చేస్తే ఇద్దరి అంగీకారం ఉంటే విడాకులు సులభంగా లభిస్తాయని తెలిసింది. అందుకనే జరిగిన సంగతిని మరుగునే ఉంచి మన ఇద్దరం సామరస్యంగా విడిపోదాము. అనవసరంగా కోర్టుకెక్కి నలుగురి నోళ్ళలోనూ పడటం నాకిష్టంలేదు.

ఒప్పుకుంటే నీకే మంచిది. అసలు విషయం తెలిస్తే నీ బ్రతుకే నవ్వులపాలవుతుంది.

ముందు ఆ లెటర్‌లోని విషయం చదివి మొద్దుబారిపోయింది సుధ. కానీ ఆ తరువాత ఆపుకోలేనంత దుఃఖం కలిగింది. తను చేసిన తప్పేమిటి అనుకుంటూ ఇప్పటికే ఎన్నోసార్లు వేసుకున్న ప్రశ్నే మళ్ళీ వేసుకుంది?

కాస్త విచారం తగ్గి, వివేచన మేల్కొని ఆలోచించడం మొదలుపెట్టింది. తనకున్న సంస్కారం, తన మనో నిబ్బరం ఏమయిపోయాయి. తన భర్త అయినంత మాత్రాన మామూలు మగ బుద్ధి పోగొట్టుకుని పరిస్థితి అర్థం చేసకొని ఉదాత్తంగా ప్రవర్తిస్తాడని అనుకోవడమే తను చేసిన మొదటి తప్పు.

కాగా మామూలుగా వచ్చే జవాబే వచ్చేసరికి దానికి తట్టుకోలేకపోవడం తన వ్యక్తిత్వానికే మచ్చ.

ఇప్పుడు తనకు మాత్రం వచ్చే నష్టం ఏముంది. భర్తగా తన బాధ్యతని నిర్వర్తించలేని ఓ భర్త తను ఉండేకంటే లేకుండా ఉంటేనే నయం. ఎందుకు అతను విడాకులు కోరాడని దుఃఖించడం అనుకుంది.

కానీ అంతలోనే సుధకి ఇంకో ఆలోచన వచ్చింది. జరిగిన దాంట్లో తన బాధ్యతలేకపోగా, అన్యాయానికి గురైనదే కాక, శిక్షకూడా తను ఒక్కతే ఎందుకు అనుభవించాలి?

ఈ ఆలోచన రావడమే తరువాయి, అంతవరకూ నిర్లిప్తంగానూ, నిరాశగానూ ఉన్న సుధలో ఒక్కసారి ఎక్కడలేని ఉత్సాహం వచ్చేసింది.

అవును. నేనెందుకు శిక్షని అనుభవించాలి? జరిగిన విషయం పైకిపొక్కకుండా రహస్యంగా పరస్పర అవగాహనతో ఎందుకు విడాకులు పొందాలి. జరిగిన విషయం నలుగురికీ తెలియనీ. తను చెడిపోయిందనే ముద్ర సమాజం వేసినా, తన భర్త ఎంతటి అసమర్థుడో అవగాహనలేని వ్యక్తో కూడా తెలియాలి.

హాయిగా విడాకులు తీసుకుని మళ్ళీ వివాహం చేసుకుని తన జీవితానికి ఇంకో రూపం ఇచ్చుకోవాలనుకుంటున్న సుధీర్‌ని కూడా జరిగిన సంఘటనలవల్ల నేనెంత బాధకి గురయ్యాను ఎలాంటి శిక్షని అనుభవిస్తున్నాను అది అతనూ అనుభవించాలి. అవును తాను విడాకులకి ఒప్పుకోదుగాక ఒప్పుకోదు. అలా అని సుధీర్‌కి లోబడినట్లుగానో లేక వేరే దిక్కులేనట్లుగానో అసహ్యించుకుంటున్నా మీరు తప్ప నాకెవరు అంటూ అబలలా రోదిస్తూ కాళ్ళు పట్టుకుని ప్రాధేయపడను.

నాకున్న చదువుకి, నాకున్న మనో నిబ్బరాన్ని, ఆత్మస్థైర్యాన్ని తోడుచేసుకుని జీవితాన్ని సాగిస్తాను. నేను ఇప్పటిదాకా నాకోసం అని కాకుండా నేనూ, సుధీర్, మాదీ అంటూ ఆలోచించిన దృక్పథాన్ని మార్చుకుంటాను. నాకోసం నేను బతుకుతాను.